## క్లుప్తంగా

### విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేశారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం 45 మంది విద్యార్థులకు 400 పుస్తకాలను అందజేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు జన్మదిన, నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు కేక్‌లు, పూలదండలు, బొకేలకు బదులుగా నోట్ పుస్తకాలను అందజేశారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గత నాలుగేళ్లగా ఏటా ఈవిధంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రిని అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రఫీఅహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాజమహేంద్రవరం వెళ్లి పింఛను అందజేత



ఆసుపత్రిలో బూరమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ విజయకుమారి

తాళ్లపూడి: తాళ్లపూడి సచివాలయం పరిధిలో నివశిస్తున్న కొడమంచిలి బూరమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న తాళ్లపూడి సచివాలయం-1 వలంటీర్ కొండేపూడి విజయకుమారి మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బూరమ్మకు వృద్ధాప్య పెన్షన్ రూ.3000 అందజేశారు. వలంటీర్‌ను తాళ్లపూడి సర్పంచ్ నక్కా వెంకటఅనురాధ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ఆశా ఆలేఖ్య అభినందించారు.

### నిడదవోలుకు రూ.55.84 లక్షల మిగులు

నిడదవోలు: 2023–24 సంవత్సరానికి నిడదవోలు మునిసిపాలిటీకి రూ.55.84 లక్షల మిగులు బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024–25 సంవత్సరానికి తయారు చేసిన బడ్జెట్ అంచనాలను మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు సభ్యులకు చదివి వినిపించారు. 2023–24 సంవత్సరానికి రూ.12.78 కోట్లు ప్రారంభ నిల్వగా తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీకి రూ.13.61 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనాలు రూపొందించారు. దీంతో మొత్తం ఆదాయం రు. 26.39 కోట్లు అయ్యింది. ఈ మొత్తంలో ఖర్చులు పోగా రూ. 55.84 లక్షల మిగులుగా బడ్జెట్‌లో చూపించారు. సమావేశంలో కౌన్సిలర్ ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు , మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, టీపీఒ సుప్రియ, టీపీఎస్ కున్యం సుజాత పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

నల్లజర్ల: స్థానిక ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్‌కు మంగళవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో ఆయన బయట పడ్డారు. నల్లజర్లలోని కళాశాల నుంచి ఉదయం 11 గంటలకు అనంతపల్లిలోని తన ఇంటికి కారును డ్రైవ్ చేసుకుంటూ ఆయన వెళుతున్నారు. ఫ్లైవర్ బ్రిడ్జి సమీపంలో కారు రహదారి పక్కకు వెళ్లి బోల్తా పడింది. స్థానికులు వెంటనే స్పందించి కారు అద్దాలు పగలగొట్టి ఆయనను బయటకు తీశారు. ఇటీవల ఆయన గుండెకు వైద్యం జరిగింది. ఈ కారణంగా కళ్లు తిరగడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టుగా చెబుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనకు స్థానికంగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం తణుకు తరలించారు.

### పోలవరం కుడి కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు రామకృష్ణ (ఫైల్)

దేవరపల్లి: దేవరపల్లి మండలం బందపురం వద్ద పోలవరం కుడి కాలువలో మంగళవారం పురుషుడి మృతదేహాన్ని గ్రామస్తులు కనుగొన్నారు. మృతుడు బందపురం గ్రామానికి చెందిన బయ్యా రామకృష్ణ(45)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ట్రైనీ డీఎస్పీ భానోదయ పరిశీలించారు. శవ పంచనామా అనంతరం పోర్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ట్రైనీ డీఎస్పీ భానోదయ తెలిపారు.

# అంబేడ్కర్ అడుగు జాడల్లో జగన్

- 19న విజయవాడలో రాజ్యాంగ నిర్మాత 125 అడుగుల విగ్రహావిష్కరణ
- విజయవంతం చేయాలని మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి
- కొవ్వూరులో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం
- విగ్రహావిష్కరణ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కొవ్వూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తానేటి వనిత



నిడదవోలులో బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, దళిత నాయకులు

కొవ్వూరు: విజయవాడ నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో ఈనెల 19న నిర్వహించే 125 అడుగుల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై కొవ్వూరు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఈ మహోత్సవానికి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలందరూ తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతోనే దళితులకు, బడుగు బలహీన వర్గాలకు అవకాశాలు లభించాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యం కలిస్తూ సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ చాగల్లు మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి పరశు రామారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నిడదవోలులో..**

నిడదవోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనుంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని చర్చిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహావిష్కరణ ఆహ్వాన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడితో పాటు పలువురు దళిత నాయకులు, కార్యకర్తలు పట్టణంలో బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి, వైస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ శాఖ అధ్యక్షుడు గుర్రం జేమ్స్, కౌన్సిలర్లు ఉసురుమర్తి జాన్‌బాబు, దాకా అనిల్ కుమార్, పార్టీ నాయకులు వెలగన పోలయ్య, వీరమళ్ళు సత్యనారాయణ, మద్దాల ప్రభు, పొట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రూ.90 కోట్లతో ఖండవల్లి అభివృద్ధి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఖండవల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: గత నాలుగున్నరేళ్లలో మండలంలోని ఖండవల్లి పంచాయతీని రూ.90 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశానని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. మంగళవారం ఆయన ఖండవల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన అభయాంజనేయస్వామి వారిని దర్శించుకున్నాక, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామస్తుల బ్యాంకు ఖాతాలకు రూ.60 కోట్లు, గ్రామంలో అభివృద్ధి పనులకు మరో రూ.30 కోట్లు ఖర్చు చేశామన్నారు. మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాము నివాసం ఉంటున్న స్థలాలకు పట్టాలు ఇప్పించాలని గ్రామంలోని కొప్పరాయి చెర్వు గట్టుపై నివశిస్తున్న పలువురు పేదలు ఎమ్మెల్యేను కోరారు. వారి నివాస ప్రాంతాలకు పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు హామీ ఇచ్చారు. గ్రామంలోని 280 ఇళ్లకు ఎమ్మెల్యే సందర్శించి, ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు కందా వెంకన్న, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాజేష్ ఎంపిక



నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన డి.రాజేష్ అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నన్నయ యూనివర్సిటీ తరపున ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పీడీ పాలేటి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. తాళ్లపూడిలో ఎమ్మెస్సీ ఫస్టియర్ చదువుతున్న రాజేష్ ఈనెల 8న తాడేపల్లిగూడెం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో పాల్గొని అర్హత సాధించాడని శ్రీనివాస్ తెలిపారు.

# జగన్ నూరు శాతం వాగ్దానాలు నెరవేర్చారు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దేవరపల్లి, నిడదవోలులో సంబరాలు



దేవరపల్లిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ప్రజాప్రతినిధులు



నిడదవోలులో కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

దేవరపల్లి: పేదల కష్టాలు తెలుసుకునేందుకు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 3,648 కిలో మీటర్ల ప్రజా సంకల్ప పాదయాత్ర చేసి ప్రజల కిచ్చిన వాగ్దానాలను వంద శాతం అమలు చేసిన ఘనుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాదయాత్ర చేశారు. దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నుంచి వైఎస్సార్ విగ్రహం వరకూ ఈ పాదయాత్ర సాగింది. వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, కడిమి రాజు, కామిశెట్టి దుర్గారావు, మాధవరపు వెంకటేశ్వరరావు, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు**

నిడదవోలు: ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు దగ్గరగా చూసి, నాటి జ్ఞాపకాల నుంచి పురుడు పోసిన నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ముగిసి, ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, వెలగన పొలయ్య, వీరమళ్ల సత్యనారాయణ, గంగుల గోపీ యాదవ్, మానుకొండ చంద్రబాబు, ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసాబేగం, గుర్రం శాంతిశ్రీ , ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



### వైఎస్సార్ చిరస్మరణీయుడు

- హోం మంత్రి తానేటి వనిత
- పశివేదలలో విగ్రహం ఆవిష్కరణ



పునః ప్రతిష్ఠించిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ప్రతి పేదవాడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పటికీ చిరస్మరణీయుడని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పశివేదల గ్రామంలో పునః ప్రతిష్ఠించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ మహానేత వైఎస్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది పేదల ప్రాణాలను కాపాడారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాట వేశారన్నారు. తండ్రికి మించిన తనయుడిగా నేడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉండవల్లి మునేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేములపల్లి పూర్ణచంద్రరావు (బూరయ్య), మాజీ ఉప సర్పంచ్ వేములపల్లి గోపి, పల్లి రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ దాసరి వెంకట్రాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, తోగుమ్మి ఉప సర్పంచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### దేవరపల్లి సీఐగా రామకృష్ణ



రామకృష్ణ

దేవరపల్లి: దేవరపల్లి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం ట్రాఫిక్ సీఐగా పని చేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో దేవరపల్లి, పాలకొల్లు, పోడూరు, చింతలపూడి, కొవ్వూరు రూరల్ , సీసీఎస్ ఎస్సైగా పని చేశారు. సీఐ రామకృష్ణను దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



సీఐ దుర్గాప్రసాద్



ఎస్ఐ వెంకటసురేష్

**నల్లజర్ల సీఐగా దుర్గా ప్రసాద్.**

నల్లజర్ల: నల్లజర్ల స్టేషన్‌కు సీఐగా బి. దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఆయన ఇంతకుముందు సామర్లకోట, మండపేటలలో పనిచేశారు. అలాగే నల్లజర్ల ఎస్ఐగా టి.వెంకటసురేష్ నియమితులయ్యారు. ఆయన ఏలూరు సీసీఎస్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. వారిద్దరూ మంగళవారం ఉదయం నల్లజర్లలో బాధ్యతలు స్వీకరించారు.

# ఆరోగ్య సురక్షలో 782 మందికి వైద్యం

నిడదవోలు రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ జె.సంధ్య అన్నారు. మండలంలోని కోరుమామిడిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ అంబటి గోపమ్మ, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి ప్రారంభించారు. శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ సంధ్య పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఆండ్రూ ఆల్బట్ లూయిస్ పర్యవేక్షణలో వైద్య నిపుణులు 426 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కె.శేషు, రాపాక వెంకట్రావు, పెద్దిరాజు, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఉండ్రాజవరంలో 356 మందికి..**

ఉండ్రాజవరం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా ఉండ్రాజవరం సచివాలయం-2 పరిధిలోని ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి సర్పంచ్ మెండే వెంకట్రావు హాజరై, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులు ఈ శిబిరంలో 356 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్‌కే రాజు, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

### ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి



సందీప్‌కుమార్ మృతదేహం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం–నిడదవోలు రోడ్డులో త్యాజంపూడి వద్ద మంగళవారం ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన కోడి సందీప్‌కుమార్(19) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సందీప్‌కుమార్, మరొక ఆరుగురు ట్రాక్టర్‌పై కొబ్బరి ఆకులు వేసుకుని వెళుతుండగా సందీప్‌కుమార్ జారి కిందపడ్డాడు. ట్రాక్టర్ చక్రాలు సందీప్‌కుమార్‌పై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు ట్రైనీ డీఎస్పీ భానోదయ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.